క్లుప్తంగా

పరీక్షల నిర్వహణ పక్కాగా ఉండాలి



జడ్చర్ల టౌన్: మండలంలోని దేవునిగుట్టతండా కేజీబీవీ, గుండ్లగడ్డతండా ప్రాథమిక పాఠశాలల్లో గురువారం జిల్లా సెక్టోరియల్ అధికారి బాలుయాదవ్, ఎంఈఓ మంజులాదేవి ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఏ–1 పరీక్షల నిర్వహణను పరిశీలించారు. పరీక్షల నిర్వహణ పక్కాగా ఉండాలని.. విద్యార్థులను అన్ని పరీక్షలకు సిద్ధం చేయాలని సూచించారు. అనంతరం కేజీబీవీలో వంటగదిని పరిశీలించి, భోజనం నాణ్యత తదితర వివరాలను తెలుసుకున్నారు. వారి వెంట కేజీబీవీ ఎస్ఓ నదియా, హెచ్ఎం తిరుపతిరెడ్డి తదితరులు ఉన్నారు.

నోట్‌పుస్తకాల పంపిణీ



హన్వాడ: మండలంలోని గొండ్యాల్ గేట్ ప్రాథమిక పాఠశాలలో గురువారం బుద్దాస్ లైట్ ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నోట్‌పుస్తకాలను పంపిణీ చేశారు. విద్యార్థులు చక్కగా చదువుకుని తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలని సంస్థ ప్రతినిధులు ఉప్పేక, డా. నాగయ్య సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ గోపాల్‌నాయక్, అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బాలకిష్టయ్య, రావుల కిష్టయ్య, హెచ్ఎం పర్వతాలు, నజియాబేగం పాల్గొన్నారు.

పకడ్బందీగా ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన



దేవరకద్ర: ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను పకడ్బందీగా చేపడుతున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసరావు అన్నారు. గురువారం పట్టణంలోని ఓ వెంచర్‌లో చేపట్టిన ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎల్ఆర్ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్న ప్లాట్ల యజమానులు సంబంధిత డాక్యుమెంట్లతో అధికారులకు అందుబాటులో ఉండాలని కోరారు. సంబంధిత అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టి, వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీఓ శ్రీనివాస్‌రెడ్డి, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గురువారం బీఆర్ఎస్‌వీ జిల్లా కోఆర్డినేటర్ పల్లయ్య పీయూ వీసీ జీఎన్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. పీయూ పరిధిలోని పీజీ కళాశాలలు, పీయూ క్యాంపస్‌లో కొత్త కోర్సులు తీసుకురావడంతో పాటు విద్యార్థులకు సరిపడా కొత్త భవనాలు నిర్మించాలని కోరారు. ముందుగా పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో రత్‌బాబు, రామకృష్ణ, మహేష్, వెంకటేష్, శ్రీను పాల్గొన్నారు.

■ పీయూ వీసీ జీఎన్ శ్రీనివాస్‌ను బీసీ మేధావుల సంఘం నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో పాండురంగం, ప్రభాకర్, వెంకట్రాములు, పురేందర్, గంగాధర్, అధ్యాపకులు ప్రవీణ, రవీందర్‌గౌడ్ పాల్గొన్నారు.

నిరుద్యోగ మహిళలకు నైపుణ్య శిక్షణ

జడ్చర్ల టౌన్: జిల్లా కేంద్రంలోని ఐటీఐ కళాశాలలో గ్రామీణ నిరుద్యోగ మహిళలకు నైపుణ్య శిక్షణ ఇస్తున్నట్లు ఎంపీడీఓ విజయకుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎంప్లాయిమెంట్ అండ్ ట్రైనింగ్ అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ ద్వారా శిక్షణ ఇస్తారన్నారు. మ్యానుఫాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ అండ్ ఆటోమేషన్, ఇండస్ట్రియల్ రోబోటిక్ అండ్ డిజిటల్ మ్యానుఫాక్చరింగ్ టెక్నాలజీ, ఆర్టిజన్ యూజింగ్ అడ్వాన్స్‌డ్ టూల్స్, బేసిక్ డిజైనర్ అండ్ వర్చువల్ వెరిఫైర్, అడ్వాన్స్‌డ్ సీఎన్‌సీ మ్యాచినింగ్ టెక్నీషియన్, మెకానిక్ ఎలక్ట్రిక్ వెహికల్ లాంటి వాటిలో రెండేళ్ల పాటు శిక్షణ ఇస్తారని తెలిపారు. ఎస్ఎస్‌సీ చదివి 14నుంచి 40 ఏళ్ల వయసు ఉన్న వారు అర్హులని.. ఆసక్తిగల వారు ఈ నెల 30వ తేదీ లోగా ధరఖాస్తు చేసుకోవాలని కోరారు.

శిశు సంజీవని

ప్రాణాలు నిలుపుతున్న నియోనేటల్ కేర్ అంబులెన్స్



నియోనేటల్ కేర్ అంబులెన్స్

- నవజాత శిశువులకు మెరుగైన వైద్యం
- వాహనంలోనే మినీ ఐసీయూ
- పేద తల్లిదండ్రులకు తగ్గుతున్న ఆర్థిక భారం

అచ్చంపేట రూరల్: బిడ్డ పుట్టగానే తల్లిదండ్రులు ఎంతగానో మురిసిపోతారు.. అదే బిడ్డకు ఏదైనా అనారోగ్య సమస్య తలెత్తితే మెరుగైన వైద్యం కోసం పెద్ద ఆస్పత్రులకు తీసుకెళ్లాల్సిన పరిస్థితి ఉంటుంది. ఇది ఎంతో వ్యయ ప్రయాసలతో కూడిన పని.. అలాంటి వారికి భరోసానిస్తోంది నియోనేటల్ కేర్ అంబులెన్స్ వాహనం. ఉమ్మడి జిల్లాలో ఎంతో మంది చిన్నారులకు ఈ వాహనం అపర సంజీవనిలా మారింది. పట్టణాల్లోని ఆస్పత్రులకు తీసుకెళ్లేందుకు ప్రైవేట్ అంబులెన్స్ నిర్వాహకులు అడిగినంత ఇవ్వాల్సిన పరిస్థితి. ఈ బాధను తప్పించేందుకు, శిశు మరణాలను తగ్గించేందుకు గత ప్రభుత్వం గతేడాది ఆగస్టు 21న నియోనేటల్ కేర్ అంబులెన్స్‌లను అందుబాటులోకి తీసుకొచ్చింది.



వాహనంలో చిన్నారులకు వైద్యసేవలు అందిస్తున్న సిబ్బంది (ఫైల్)

ఉమ్మడి జిల్లాలో ఐదు..

నవజాత శిశువు సంరక్షణలో భాగంగా ఉమ్మడి పాలమూరు జిల్లాలోని గద్వాలకు ఒకటి, మహబూబ్‌నగర్‌కు 2, నాగర్‌కర్నూల్ జిల్లాలోని అచ్చంపేటకు ఒకటి, వనపర్తి జిల్లాకు ఒక్కో వాహనం చొప్పున మొత్తం ఐదు వాహనాలు అందించింది.

108కు కాల్ చేస్తే సరి..

నవజాత శిశు మరణాలు తగ్గించడంలో నియోనేటల్ వాహనం ఎంతో ఉపయోగపడుతుంది. అత్యవసర సమయంలో 108కు కాల్ చేస్తే చెప్పిన స్థలానికి చేరుకొని శిశువుకు అవసరమైతే వెంటిలేటర్ కూడా పెట్టి కావాల్సిన వైద్యసేవలు అందిస్తూ ఆస్పత్రులకు చేరుస్తున్నారు. నవజాత శిశువులను ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుంచి జిల్లా ఆస్పత్రికి తీసుకొస్తున్నారు. మరింత మెరుగైన వైద్యం కోసం నీలోఫర్, ఉస్మానియా, గాంధీ ఆస్పత్రులకు తరలిస్తున్నారు. దీంతో కన్నవారికి ఆర్థిక భారం తగ్గడంతో పాటు అంబులెన్స్‌లోనే వైద్యసేవలు అందుతాయి.

అందించే సేవలు..

అప్పుడే పుట్టిన శిశువు నుంచి నెల వయసున్న పిల్లలను నియోనేటల్‌గా పరిగణిస్తారు. నవజాత శిశువులు ఎక్కువగా శ్వాస, గుండె సంబంధిత సమస్యలతో బాధపడుతుంటారు. సకాలంలో పెద్దాసుపత్రులకు తరలించాలంటే అంబులెన్స్‌లోనే మినీ ఇంటెన్సివ్ కేర్ యూనిట్ (ఐసీయూ) అవసరం. అదే విభాగాన్ని అధునాతన పరికరాలతో 108 నియోనేటల్ వాహనాన్ని రూపొందించారు. కృత్రిమ శ్వాస అందించే వెంటిలేటర్, ఆక్సిజన్, నాడి, రక్తపోటును పరీక్షించే మానిటర్, బయటి నుంచి శ్వాస అందించే బ్యాగా మాస్క్ డివైజ్, శిశువును వెచ్చగా ఉంచే బేబీ వార్మర్ లాంటి పరికరాలు అందుబాటులో ఉంటాయి. ఒక్కో వాహనంలో నిరంతరం అందుబాటులో ఉండేలా ఇద్దరు చొప్పున ఈఎంఆర్‌లు, మరో ఇద్దరు పైలెట్లను నియమించారు.

అత్యవసర వైద్యసేవలు అందించి వేలాది మంది శిశువుల ప్రాణాలు రక్షించడంలో సిబ్బంది కీలక పాత్ర పోషిస్తున్నారు. ఇప్పటి వరకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు 2,640 మంది చిన్నారుల ప్రాణాలు కాపాడారు.

వాహనాల వారీగా సేవలు పొందిన శిశువులు

వాహనం	2023 (ఆగస్టు నుంచి డిసెంబర్ వరకు)	2024 (జనవరి నుంచి సెప్టెంబర్ వరకు)
మహబూబ్‌నగర్-1	129	547
మహబూబ్‌నగర్-2	82	351
గద్వాల	131	388
అచ్చంపేట	136	432
వనపర్తి	86	358

శిశు మరణాల రేటు తగ్గింది..



అత్యాధునిక నియోనేటల్ వాహనాలు అందుబాటులోకి వచ్చాక ఉమ్మడి జిల్లాలో శిశు మరణాల రేటు తగ్గింది. అనారోగ్యంతో బాధపడుతున్న చిన్నారులను గ్రామీణ ప్రాంతాల నుంచి జిల్లా ఆస్పత్రులకు సకాలంలో తరలిస్తున్నాం. అవసరమైతే హైదరాబాద్‌కు తీసుకెళ్తున్నాం. శిక్షణ పొందిన సిబ్బంది పర్యవేక్షణలో పెద్దాసుపత్రులకు పంపిస్తున్నాం. వాహనంలో ఉన్న వెంటిలేటర్ సాయంతో కృత్రిమ శ్వాస, నియోనేటల్ వార్మర్ సాయంతో తల్లిగర్భంలో ఉన్న ఉష్ణోగ్రతను అందిస్తూ ప్రాణాలు రక్షిస్తున్నాం. ఈ వాహనాలు అందుబాటులోకి రావడంతో పేద తల్లిదండ్రులకు ఆర్థికభారం తగ్గడంతో పాటు మానసిక ఆందోళన తప్పుతుంది.

– రవికుమార్, ప్రోగ్రాం మేనేజర్, మహబూబ్‌నగర్

విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి



భవిత కేంద్రంలో విద్యార్థుల వివరాలు తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్

దేవరకద్ర: ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ సూచించారు. గురువారం దేవరకద్రలోని భవిత కేంద్రంలో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా కేంద్రంలో విద్యార్థుల హాజరును పరిశీలించారు. మానసికంగా ఎదుగుదల లేని విద్యార్థులపై జాగ్రత్తగా ఉండాలన్నారు. దివ్యాంగ విద్యార్థులు చదువులో రాణించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థులు కేంద్రానికి వచ్చి, తిరిగి వెళ్లే వరకు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వారికి అర్థమయ్యే విధంగా బోధన చేయాలన్నారు. సమాజంపై వారికి అవగాహన వచ్చే విధంగా తీర్చిదిద్దాలన్నారు. అదేవిధంగా కేంద్రం పరిసరాలతో పాటు టాయిలెట్లను శుభ్రంగా ఉంచాలని సూచించారు. అదనపు కలెక్టర్ వెంట ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఎంఈఓ బలరాం, ఎంపీఓ శ్రీనివాస్‌రెడ్డి, సిబ్బంది చంద్రశేఖర్‌గౌడ్, సీఆర్పీ రాధిక, అనురాధ ఉన్నారు.

పొగాకు వినియోగం.. ప్రాణాంతకం



గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న వైద్యసిబ్బంది

నవాబుపేట: పొగాకు ఉత్పత్తుల వినియోగం ప్రాణాంతకమని.. ప్రజలు దూరంగా ఉండాలని వైద్యసిబ్బంది సూచించారు. గురువారం మండల కేంద్రంలో ఉన్నత పాఠశాల విద్యార్థులచే అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పొగాకు క్యాన్సర్ కారకమని.. పొగాకు ఉత్పత్తుల వినియోగంతో స్త్రీ, పురుషులకు ప్రాణాంతకమైన వ్యాధులు వస్తాయన్నారు. ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది రాములు, బాలమణి, శ్రీనివాస్, శరభలింగం పాల్గొన్నారు.

ఆఫర్ మెసేజ్‌లను నమ్మి మోసపోవద్దు

మహబూబ్‌నగర్ క్రైం: సెల్‌ఫోన్ లేదా ఈ మెయిల్‌కు అపరిచిత వ్యక్తులు పంపించే ఆఫర్ మెసేజ్‌లను నమ్మి మోసపోవద్దని టూటౌన్ సీఐ ఇజాజుద్దీన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని బాలికల జూనియర్ కళాశాలలో గురువారం సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ఆన్‌లైన్‌లో లావాదేవీలు నిర్వహించే వారు కొత్త వ్యక్తుల మాటలను ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మవద్దన్నారు. తెలియని మెసేజ్‌లపై క్లిక్ చేయరాదన్నారు. ముఖ్యంగా ఆధార్ నంబర్లు, ఓటీపీ, ఏటీఎం పిన్ నంబర్, క్రెడిట్ కార్డు, డెబిట్ కార్డు ఇతర ఐడీ వివరాలు చెప్పరాదన్నారు. ఒకవేళ అనుకోకుండా సైబర్ నేరగాళ్ల బారిన పడి డబ్బులు పోగొట్టుకుంటే, తక్షణమే 1930 లేదా డయల్ 100 నంబర్లకు ఫిర్యాదు చేయాలని సూచించారు. అదేవిధంగా వన్‌టౌన్ ఎస్ఐ రషీద్ ఆధ్వర్యంలో స్థానిక రవీంద్రనగర్‌లో అవగాహన కల్పించారు.



జిల్లా కేంద్రంలో సైబర్ నేరాలపై అవగహన కల్పిస్తున్న పోలీసులు

వ్యాసరచన పోటీలు..

రాజాపూర్ (బాలానగర్): పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని బాలానగర్ ఏకలవ్య ట్రైబల్ జూనియర్ కళాశాలతో పాటు ప్రభుత్వ జూనియర్ కళాశాల, తెలంగాణ రెసిడెన్షియల్, మోతీ ఘనపూర్, ఉడిత్యాల, పెద్దరేవల్లి, నేరళ్లపల్లి, బాలానగర్ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు ఉపన్యాస పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సైబర్ నేరగాళ్ల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్ఐ తిరుపాజీ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



బాలానగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో..

నేడు కేజీబీవీ భవన నిర్మాణానికి భూమిపూజ

గండేడ్: మండల కేంద్రంలో శుక్రవారం కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం భవన నిర్మాణానికి పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి భూమిపూజ చేయనున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి తెలిపారు. అదేవిధంగా ఉదయం 11 గంటలకు కొంరెడ్డిపల్లి నుంచి హన్వాడ మండలం షేక్‌పల్లి వరకు బీటీరోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారని.. మధ్యాహ్నం 1గంటకు సల్కర్‌పేట్‌లో వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తారని పేర్కొన్నారు. అనంతరం వెన్నాచేడ్ పెద్దచెరువు సాలార్‌నగర్ ప్రాజెక్టులో చేపపిల్లలను వదలనున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే పర్యటనలో అధికారులతో పాటు ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు పాల్గొనాలని కోరారు.

సేవాలాల్ మహరాజ్ మండల కమిటీ ఎన్నిక

నవాబుపేట: సేవాలాల్ మహరాజ్ మండల అధ్యక్షుడిగా యన్మన్‌గండ్లకు చెందిన నీల్యానాయక్‌కు ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి చందర్ నాయక్ తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని బంజారా భవన్‌లో మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా లిబ్యానాయక్, రాజునాయక్, చందర్, ఉపాధ్యక్షులుగా శంకర్, రాంసింగ్, ప్రధాన కార్యదర్శిగా నర్సింహ నాయక్, కోశాధికారిగా తరుణ్ నాయక్, కార్యదుర్శులుగా హరినాయక్, బాస్కర్, కుమార్, రాజు రవి, మాంగ్యానాయక్, శ్రీను, లక్ష్మణ్‌లను ఎన్నుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంతోష్ నాయక్, చందు, ప్రకాష్, వెంకట్, శంకర్ నాయక్ పాల్గొన్నారు.

ఓవర్‌లోడ్ వాహనాలపై ఫిర్యాదు

మిడ్జిల్: మండలంలోని భైరంపల్లి శివారులో ఉన్న క్రషర్ మిషన్ల నుంచి ఓవర్ లోడ్‌తో వెళ్తున్న వాహనాలతో బీటీరోడ్డు దెబ్బతింటుందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తంచేశారు. ఓవర్‌లోడ్ వాహనాలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ గురువారం స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఓవర్‌లోడ్ వాహనాల కారణంగా 4 కి.మీ. రోడ్డు మొత్తం దెబ్బతింటుందని తెలిపారు. ఫిర్యాదు చేసిన వారిలో బీరయ్య, మల్లయ్య, జంగయ్య, నాగేష్, శ్రీను, శివకుమార్, మహేష్ పాల్గొన్నారు.

ఎక్సైజ్ అధికారుల దాడులు

మహమ్మదాబాద్: మండల కేంద్రంలో అక్రమంగా ఏర్పాటు చేసిన కల్లు విక్రయ కేంద్రాలపై గురువారం ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. గ్రామంలో కల్లు డిపో నిర్వహణకు సంబంధించి 14 లైసెన్స్‌లు ఉన్నప్పటికీ.. రెండు నెలలుగా కల్లు అమ్మకాలు సాగడంలేదు. దీంతో బయటి వ్యక్తులు కల్లును అక్రమంగా విక్రయిస్తున్నారని గ్రామస్తుల ఫిర్యాదు మేరకు.. టాస్క్‌ఫోర్స్ సీఐ కవిత ఆధ్వర్యంలో ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. గ్రామంలో ఓ వ్యక్తి కల్లు తయారు చేస్తుండగా.. పట్టుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

కులగణనపై చైతన్యం తీసుకురావాలి

జడ్చర్ల టౌన్: రాష్ట్ర ప్రభుత్వం త్వరలో చేపట్టనున్న కులగణనపై బీసీల్లో చైతన్యం తీసుకురావాలని బీసీ జాగృతి సేన రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణయాదవ్ అన్నారు. గురువారం పట్టణంలోని ఎమ్మార్సీ భవనం సమీపంలో నిర్వహించిన బీసీ సేన ముఖ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కులగణనలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా ప్రతి బీసీ వివరాలు నమోదయ్యేలా చూడాలన్నారు. బీసీ సేన జాగృతి ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంతాల్లో చైతన్య కార్యక్రమాలు నిర్వహించాలని మండల కమిటీలకు సూచించారు. ఈ సందర్భంగా బీసీ జాగృతి సేన మండల ప్రచార కార్యదర్శిగా కావలి రాములు, సహాయ కార్యదర్శిగా చెన్నయ్య, మున్సిపల్ ప్రధాన కార్యదర్శిగా వెంకటేష్‌లను ఎన్నుకున్నారు. అనంతరం వారికి నియామక పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు నిరంజన్, ప్రధాన కార్యదర్శి నర్సింహులు, శేఖర్, గోపాల్ పాల్గొన్నారు.



నియామక పత్రం అందజేస్తున్న కృష్ణయాదవ్

వచ్చేనెలలో కేంద్ర బృందం పర్యటన



మాట్లాడుతున్న డీపీఎం నాగమల్లిక

నవాబుపేట: మండలంలో మహిళా సంఘాల సభ్యులు ఏర్పాటు చేసుకున్న యూనిట్లను పరిశీలించేందుకు వచ్చేనెల కేంద్ర బృందం వస్తున్నట్లు డీపీఎం నాగమల్లిక తెలిపారు. గురువారం మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో ఎంఎంఎస్ మండల కమిటీ, అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రభుత్వం అందించిన రుణాలతో ఏర్పాటు చేసుకున్న యూనిట్లను కేంద్ర బృందానికి చూయించేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. సంబంధిత అధికారులు పూర్తిస్థాయి రికార్డులతో అందుబాటులో ఉండాలన్నారు. కేంద్ర బృందం పర్యటనపై మహిళా సంఘాల సభ్యులకు అవగాహన కల్పించాలన్నారు. అదేవిధంగా ఉపాధి హామీ పనులను సైతం కేంద్ర బృందం క్షేత్రస్థాయిలో పరిశీలిస్తుందని తెలిపారు. సమావేశంలో జిల్లా అధికారి చెన్నయ్య, ఏపీఎం జీవరత్నం, సీసీలు రమాదేవి, కాంచన, మండల మహిళా సమాఖ్య అధ్యక్ష కార్యదర్శులు బాలమణి, యశోద ఉన్నారు.

ధన్వంతరి జయంతి అధికారికంగా నిర్వహించాలి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): నాయీబ్రాహ్మణుల ఆరాధ్య దైవం, ఆయుర్వేదానికి మూల పురుషుడైన ధన్వంతరి జయంతిని అధికారికంగా నిర్వహించాలని నాయీబ్రాహ్మణ ఉద్యోగ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు బాలరాజు కోరారు. ఈ మేరకు గురువారం హైదరాబాద్‌లో రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి రెఫరెన్స్ కాపీని కూడా జత చేసినట్లు తెలిపారు. ధన్వంతరి జయంతిని అధికారికంగా నిర్వహించడంపై మంత్రి సానుకూలంగా స్పందించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి రవి, ఉపాధ్యక్షుడు నర్సింహులు, సహాయ కోశాధికారి బాలస్వామి పాల్గొన్నారు.



మంత్రి జూపల్లి కృష్ణారావుకు వినతిపత్రం అందజేస్తున్న సంఘం నాయకులు



పనుల్లో వేగం పెంచండి

కోయిల్‌కొండ: మండల కేంద్రంలో రూ. 60 లక్షలతో చేపట్టిన గ్రంథాలయ భవన నిర్మాణ పనుల్లో వేగం పెంచి త్వరగా పూర్తిచేయాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నరసింహారెడ్డి అన్నారు. గురువారం గ్రంథాలయ భవన నిర్మాణ పనులను పరిశీలించారు. నాణ్యతగా పనులు చేపట్టాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ఆయన వెంట డీఈ రాము, గ్రంథాలయ కార్యదర్శి మనోజ్‌కుమార్, మాజీ జెడ్పీటీసీ విజయభాస్కర్‌రెడ్డి ఉన్నారు.

నేడు రామేశ్వరానంద సమారాధన

జడ్చర్ల టౌన్: మండలంలోని గొల్లపల్లి లలితాంబికా తపోవనంలో శుక్రవారం రామేశ్వరానంద పుణ్యసమారాధన నిర్వహించనున్నట్లు తపోవన అభివృద్ధి కమిటీ సభ్యులు గురువారం తెలిపారు. సమారాధనలో భాగంగా అభిషేకం, అలంకరణ, అష్టోత్తర శతనామార్చనలు, లలితా జ్ఞాన యజ్ఞం కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

27న సదర్ ఉత్సవాలు

నవాబుపేట: హైదరాబాద్‌లో ఈ నెల 27న ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో సదర్ ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ మాజీ యువజన అధ్యక్షుడు వాసుయాదవ్ గురువారం తెలిపారు. కార్తీక మాసంలో నిర్వహించే సదర్ ఉత్సవాలను హైదరాబాద్ నుంచి ప్రారంభిస్తారని.. మండలంలోని యాదవులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

వైభవంగా రఘుప్రేమ తీర్థుల జయంత్యుత్సవాలు

నారాయణపేట రూరల్: జిల్లా కేంద్రంలోని పరిమళాపురం రాఘవేంద్ర స్వామి ఆలయంలో గురువారం రఘుప్రేమ తీర్థుల జయంత్యుత్సవాలను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి సుప్రభాత సేవ, పంచామృతాభిషేకం, పుష్పాలంకరణ, హరిదాసుల సంకీర్తనలతో మహా రథోత్సవం తదితర పూజా కార్యక్రమాలు కొనసాగాయి. అనంతరం విద్వాన్ అనిల్ దేషాయ్, హరీష్ ఆచార్యుల ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక ప్రవచనం నిర్వహించారు. స్వామివారి మహిమలను కొనియాడారు. కార్యక్రమంలో అర్చకులు నర్సింహాచారి, భీంసేన్‌రావు, ప్రభంజన్‌రావు, పద్మనాభరావు, మంజునాథ్‌జోషి, నారాయణరావు, గోపీనాథ్‌రావు పాల్గొన్నారు.

మహనీయుల స్ఫూర్తితో ముందుకు సాగాలి



ఊట్కూరు: మహనీయుల స్ఫూర్తితో విద్యార్థులు ముందుకు సాగాలని రిటైర్డ్ డీఈఓ డా. విజయ్‌కుమార్ అన్నారు. సత్యశోధన పాదయాత్ర గురువారం ఊట్కూరుకు చేరగా.. గ్రామస్తులు, విద్యార్థులు ఘన స్వాగతం పలికారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల, బాలుర ఉన్నత పాఠశాలల్లో నిర్వహించిన సమావేశాలకు ఆయన హాజరై మహాత్మా గాంధీజీ జీవిత చరిత్రను విద్యార్థులకు వివరించారు. చిన్న నాటి నుంచే పుస్తక పఠన ంపై ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. విద్యార్థులకు సామాజిక స్పృహపై అవగాహన ఉండాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సత్యనారాయణ, ఎల్కోటి నారాయణ రెడ్డి పాల్గొన్నారు.